క్లుప్తంగా

రవీందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు తాడూరి రవీందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. జగిత్యాలకు చెందిన సుప్రసిద్ధ కథా రచయిత కేవీ.నరేందర్ రచనలు – పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి తాడూరి రవీందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో రవీందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ అంబట్‌పల్లికి చెందిన రవీందర్.. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లోని బీసీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

పట్టపగలే దొంగల బీభత్సం



రామన్నపేట: ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి మేడారం జాతరకు వెళ్లడాన్ని దొంగలు ఆసరా చేసుకున్నారు. నగరంలోని బ్యాంక్‌కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని గురువారం పట్టపగలే దోపిడీకి తెగబడ్డారు. తాళాలు పగలు గొట్టి నగలు, ఆభరణాలను చోరీ చేశారు. సాంబర రాజశేఖర్ ఇంటిలో రెండు తులాల బంగారం, 1.25 కిలో వెండి చోరీకి గురైందని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అలాగే, అద్దె గృహంలోని గంగుల సంతోష్ ఇంటిలో రూ.70 వేల నగదును దొంగలు అపహరించారని వివరించారు.

పర్యావరణంపై కళా బృందాల ప్రదర్శన



హన్మకొండ: పర్యావరణ పరిరక్షణ, మేడారంలో ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై కళా బృందం ప్రదర్శనలిచ్చింది. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావుకు చెందిన ప్రకృతి మిత్ర కళాజాత కళాకారులు కాజీపేట్ బస్టాండ్, హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో గురువారం ప్రదర్శనలు ఇచ్చారు. మేడారం జాతరకు వెళ్లే వారు పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటలు, నృత్యాలు, వీధి నాటికలు, పల్లె సుద్దులు రూపాల్లో అవగాహన కల్పించారు. మేడారం జాతరలో ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా చూడాలని కోరారు. కళాకారుడు వెన్నమల్ల వెంకటేష్ బృందం ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఇచ్చారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



హన్మకొండ చౌరస్తా: భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని హనుమకొండ 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్ –1 కాలనీలోని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అబుల్ కలాం ఆజాద్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొట్ల శ్రీనివాస్, కుమార్‌రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, రాజ్‌కుమార్, వెంకటేష్, చిర్ర శ్రవణ్, భిక్షపతి, మురళి, రవికిరణ్, వంశీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్ల సంఘం డైరీ ఆవిష్కరణ



హన్మకొండ చౌరస్తా / కాజీపేట: హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో రిటైర్డ్ రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ కాజీపేట శాఖ –2024 డైరీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన రైల్వే పెన్షనర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కాజీపేట అధ్యక్షుడు కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి చంద్రమోహన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు తరలివెళ్తున్న భక్తులు



కాశిబుగ్గ: వరంగల్‌లో మేడారం బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

కాశిబుగ్గ: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్ పాయింట్‌ను వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా ఏర్పాటు చేశారు. మంగళ, బుధవారాల్లో జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గురువారం సమ్మక్క గద్దెపైకి రానుండటంతో మేడారం వెళ్లేందుకు బస్ పాయింట్ ప్రాంగణం మొత్తం జనసందోహంగా మారింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేసి టికెట్లు ఇచ్చి ఎప్పటికప్పుడు ప్రయాణికులను బస్సుల్లో తరలిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక రైళ్లలో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి బస్సుల ద్వారా జాతరకు తరలివెళ్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం 4గంటల వరకు 250 ట్రిప్పుల్లో 10,823 మంది ప్రయాణికులను మేడారానికి తరలించినట్లు డీఎం ధరంసింగ్ తెలిపారు. వరంగల్ బస్ పాయింట్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

వీధులన్నీ నిర్మానుష్యం

ఖిలా వరంగల్: ఆసియా ఖండంలోని అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ మహా కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈక్రమంలో డివిజన్లలోని వాడలన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో జాతర తరలివెళ్తున్నారు.



ఖిలా వరంగల్: నిర్మానుష్యంగా ఉన్న ఓ కాలనీరోడ్డు

అమ్మవారిపేటలో గద్దెకు చేరుకున్న సమ్మక్క



అమ్మవారిపేటలో భక్తుల సందడి



సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని అమ్మవారిపేట సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా సమ్మక్కను దామెరగుట్టల నుంచి పూజారులు అమ్మవారిపేట గద్దె వద్దకు గురువారం తీసుకొచ్చారు. సమ్మక్క రాక సందర్భంగా దామెర గుట్టల వద్ద డీసీపీ బారి ఆధ్వర్యంలో పోలీసులు మూడు రౌండ్లను గాలిల్లోకి కాల్చి గౌరవ వందనం సమర్పించారు. సమ్మక్క, సారలమ్మల దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించారు. పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యుత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం భక్తులకు మాస్కుల పంపిణీ



కాజీపేట రైల్వే స్టేడియంలో ఆర్టీసీ సిబ్బందికి మాస్కులు పంపిణీ చేస్తున్న వాకర్స్ ప్రతినిధులు



శంభునిపేటలో..

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ పాయింట్‌లో మేడారం జాతరకు వెళ్లే భక్తులు, ఆర్టీసి సిబ్బందికి వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నారపు రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ బి.రాజేశ్వర్, ఆర్టీసీ వరంగల్ –2 డిపో మేనేజర్ గుండా సురేష్, ప్యాసింజర్ గైడ్ బైరి రవీందర్, వాకర్స్ సభ్యులు నాగపురి సారయ్య, రవీందర్‌రెడ్డి, సాగర్‌కొండ శంకర్, తిరుపతి, సుధాకర్‌రెడ్డి, రత్నాకర్, దయాకర్ పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్ ఏర్పాటు

కాజీపేట రైల్వే స్టేడియంలో బోడగుట్ట మెడికల్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మేడారం భక్తుల కోసం మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్లు మధులత, జెరుషాసృజన ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు.

శంభునిపేట విశ్వనాథ కాలనీలో..

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో మేడారం భక్తులకు గురువారం మాస్కులు పంపిణీ చేశారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఆర్టీసీ డీఎం ధారాసింగ్ హాజరై మాస్కులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, ప్రహ్లాద్, ప్రసాద్, రంగరాజు రావు, అశోక్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకం



మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్

మామునూరు: శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సేవలో పోలీసుల పాత్ర కీలకమని, 9 నెలల ట్రెయినింగ్‌ను క్రమశిక్షణతో పూర్తి చేయాలని తెలంగాణ అడిషనల్ డీజీపీ శ్రీనివాస్‌రావు సూచించారు. రాష్ట్రాభివృద్ధికి మహిళా పాత్ర కూడా ప్రధానమని, పోలీసు శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా అభ్యర్థులు నడుచుకోవాలన్నారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో 834 మంది మహిళా సివిల్ కానిస్టేబళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్‌తో కలిసి అడిషనల్ డీజీపీ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీస్‌శాఖలో మహిళల సంఖ్య పూర్వం తక్కువగా ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం 33శాతం రిజర్వేషన్ కల్పించటంతో చాలా మంది మహిళలు పోలీస్ శాఖలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధనే లక్ష్యంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం విధినిర్వహణలో ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల పాటు నిర్వహించే శిక్షణకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని తెలిపారు. టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, ఏసీలు బి.పాండునాయక్, డీఎస్పీలు వెంకటేశ్వరావు, రవీందర్, సీఎల్ఐలు వడ్డె నరేష్, అశోక్, సుధాకర్, సీడీఐలు చంద్రశేఖర్, నవీన్, విజయ్‌కుమార్, మహేష్, ఏసీడీఐలు దశరథం, అరుణ, దీపక్, రాజన్‌బాబు, దేవేందర్‌రెడ్డి, శ్రీలేఖ, రాధిక, డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామచారి పాల్గొన్నారు.

కిరాయిదారుడి ఆత్మహత్య.. యజమానికి జైలు

● తీర్పు వెలువరించిన జడ్జి

వరంగల్ లీగల్: ఇల్లు అద్దెకు తీసుకున్న కిరాయి దారుడి ఆత్మహత్యకు కారకుడైన ఇంటి యజమానికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హనుమకొండ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు గురువారం తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పచ్చర్లకు చెందిన కురువ రాఘవేంద్ర, సునీత దంపతులు బతుకు దెరువు కోసం 2020 జూలైలో కాజీపేటకు వచ్చి వెంకట్రాదినగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని ఉంటున్నారు. వికలాంగుడైన రాఘవేంద్ర.. కాజీపేటకు చెందిన శనిగరపు సతీష్‌కు చెందిన సోమిడికి వెళ్లే మార్గంలోని రేకుల షెడ్డుకు కిరాయి తీసుకుని చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అద్దెకు ఇచ్చిన షెడ్ పక్కనే యజమాని సతీష్‌కు మరో షెడ్డు కలదు. కొన్ని నెలలపాటు వారి వ్యాపారాలు సాగాయి. ఈక్రమంలో వ్యాపారం, గిరాకీ విషయంలో ఇద్దరు గొడవ పడ్డారు. ఈక్రమంలో రాఘవేంద్ర ఆత్మహత్య చేసుకోగా, మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువుకావడంతో శనిగరపు సతీష్‌కు ఐదేళ్ల జైలు, రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. ఈకేసును పోలీసు అధికారులు సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ ఏఎస్సై పరమేశ్వరి పర్యవేక్షించారు. కానిస్టేబుల్ ఎరుకొండ సుధాకర్, ఎండీ.ఇమ్రాన్.. సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ భద్రాద్రి కేసు వాదించారు.

హారిజంటల్ విధానాన్ని ఎత్తివేయాలి



అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న నిరుద్యోగ మహిళలు, విద్యార్థినులు

హన్మకొండ: టీఎస్‌పీఎస్సీ నియామకాల్లో మహిళలను హారిజంటల్ విధానంలో ఎంపిక చేసే విధానాన్ని ఎత్తివేయాలని, వర్టికల్ విధానాన్ని అమలు చేయాలని మహిళా నిరుద్యోగులు డిమాండ్ చేశారు. మహిళలకు హారిజంటల్ విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో మహిళా నిరుద్యోగులు, విద్యార్థినులు గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు ఖర్చు పెడుతూ కోచింగ్ తీసుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో హారిజంటల్ విధానాన్ని తీసుకురావడం వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. గత పాలకులు చేసిన తప్పిదాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని వర్టికల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ మహిళలు మమత, అనూష, స్వాతి, అనిత, వసంత, కవిత, నిరుద్యోగులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలని వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలల విద్యాభివృద్ధిపై కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల డ్రాప్‌ఔట్ శాతం తగ్గించి.. వారంతా కోర్సు పూర్తి చేసేలా చూడాలని, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేలా కళాశాలల్లో జాబ్‌మేళాలు నిర్వహించాలన్నారు. కళాశాలలకు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం సహకారం ఉంటుందని చెప్పారు. కన్వీనర్, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పోషయ్య, డాక్టర్ ధర్మారెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యా దేవి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, డీఆర్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ విష్ణు కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

10లోగా భూసేకరణ పూర్తి

మార్చి 10 లోపు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ల్యాండ్ అక్విజేషన్‌పై ఢిల్లీ నుంచి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్‌హెచ్ పనులు, కాజీపేట నుంచి విజయవాడ మధ్య మూడవ రైల్వేలైన్ భూ సేకరణ గురించి కలెక్టర్ వివరించారు. ల్యాండ్ అక్విజేషన్ తహశీల్దార్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న సంఘం నాయకులు



అరూరికి ఆశీర్వచనాలు అందిస్తున్న అర్చకుడు

హన్మకొండ: హసన్‌పర్తిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ 20వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నోజు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, హసన్‌పర్తి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు శీలం పృథ్వీరాజ్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, బీజేపీ 66వ డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, రైల్వే బోర్డు సభ్యుడు దాసరి రాజు, బీజేపీ యువమోర్చా డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ సాయి కిరణ్, విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పూజలు

హన్మకొండ: హసన్‌పర్తిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొనారు.

అవినీతి నిర్మూలనకు చర్యలు చేపట్టాలి



సీఎంకు రాసిన లేఖను విడుదల చేస్తున్న శేషు

హన్మకొండ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు చేస్తున్న అవినీతిని అరికట్టాలని, అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజావేదిక చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు సూచించారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హనుమకొండ సుబేదారిలో గురువారం విడుదల చేసి మాట్లాడారు. ఇటీవల హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జ్యోతి లాంటి వారి అవినీతి, అక్రమాలు వెలుగుచూశాయని చెప్పారు. ఈక్రమంలో అవినీతి నిర్మూలనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని గుర్తుచేశారు. రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్, ఐఏఎస్ అధికారులైన అరవింద్ కుమార్, రజిత్ కుమార్ లాంటి వారిపై వస్తున్న అవినీతి ఆరోపణలు, తహసీల్దార్ స్థాయి అధికారులు, పోలీసు అధ/కారులు అవినీతికి పాల్పడుతున్నారని వివరించారు. అవినీతిని అరికట్టకపోతే రాష్ట్రానికి, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులను కఠినంగా శిక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రమేష్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

కాజీపేట: పట్టణంలో మాదక ద్రవ్యాల క్రయ, విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వై.సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి బంగారంలాంటి భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల విక్రయాలు, వినియోగం జరగకుండా పోలీసులకు ప్రజలు, మీడియా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు లవన్‌కుమార్, శివకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు బొకే ఇస్తున్న వడుప్సా ప్రతినిధులు

వరంగల్: ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం (వడుప్సా) ప్రతినిధులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును 3వ డివిజన్ పైడిపల్లిలో గురువారం కలిసి వరంగల్ జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య ఆధ్వర్యంలో వడుప్సా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డితో కలిసి వడుప్సా ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలకు శాశ్వత ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం, పదవ తరగతి పరీక్షల రుసుంను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు అనుమతించాలని కోరారు. వడుప్సా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ విద్యాసాగర్, వరంగల్ జోన్ కార్యదర్శి విలియం, జిల్లా ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ నర్సయ్య, స్పోర్ట్స్ కన్వీనర్ సంజీవ, వరంగల్ జోన్ జాయింట్ సెక్రెటరీ ఎండీ.నసీరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.ఉస్మాన్ అలీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కన్వీనర్ ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.

ఆర్‌టీఐ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, కమిటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన సదస్సు పోస్టర్లను హనుమకొండ కాకాజీకాలనీలోని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పారదర్శకతను సామాన్యులకు తెలియజేసేందుకు ఆర్‌టీఐ చట్టాన్ని తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఈ చట్టాన్ని ప్రజలకు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని కొనియాడారు. ఈ చట్టం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సదస్సులు నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టపై అవగాహన పెంచుకుని అవినీతిపై ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్రవంతి, జిల్లా కన్వీనర్ నమిండ్ల హరీష్, అక్కెల్లి పవన్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో రైతులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..

విద్యారణ్యపురి: ఢిల్లీలో రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రుణమాఫీ చేయాలని, పంటల వ్యర్థాలను కాల్చివేస్తున్న రైతులపై కేసులు పెట్టడం మాని ప్రత్యామ్నాయాలను సూచించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న రైతులపై ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జి చేసి రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించడం శోచనీయమని పేర్కొన్నారు. గతంలోనూ ఆందోళన చేసిన రైతుల ఉద్యమాన్ని అణిచివేసి, వాహనాలతో తొక్కించి పలువురు రైతుల ప్రాణాలను కూడా తీశారని తెలిపారు. రైతుల ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వ వైఖరే కారణం అని వారు తెలిపారు.